సాక్షి గుంటూరు

బుధవారం। 3। ఏప్రిల్। 2024



పోలీసు కవాతు

క్రోసూరు: మండలంలోని పారుపల్లి, పీసపాడు గ్రామాల్లో మంగళవారం సీఐ మంగారావు ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు.



ఘనంగా హరిద్ర శృంగారార్చన

పిట్టలవానిపాలెం: చందోలులో ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చన నిర్వహించారు. బండ్లమ్మను మహా గౌరీదేవిగా అలంకరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
గుంటూరు	6.26	4.44
నరసరావుపేట	6.28	4.46
బాపట్ల	6.26	4.44

న్యూస్‌రీల్

ఏలూరు ఐజీకి గుంటూరు బాధ్యతలు

పట్నంబజారు: ఏలూరు ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు గుంటూరు రేంజ్ అదనపు బాధ్యతలు అప్పజెపుతూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు ఐజీ జి.పాలరాజును ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అశోక్‌కుమార్ అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

హర్షవర్ధన్‌కు అరుదైన గౌరవం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): మాజీ భారత జట్టు క్రీడాకారుడు, ఆంధ్రప్రదేశ్ హాకీ ప్రధానకార్యదర్శి హర్షవర్ధన్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయనను హాకీ ఇండియా ఢిల్లీలో 'ఇంటర్నేషనల్ అంపైర్స్ మేనేజర్' అవార్డుతో సత్కరించింది. అవార్డుతోపాటు రూ.2.5 లక్షల నగదు బహుమతిని అందజేశారు. ఆంధ్రా నుంచి ఈ అవార్డు అందుకున్న తొలి వ్యక్తి ఆయనే కావడం గమనార్హం. సోమవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో హాకీకి విశేష సేవలందించిన వారికి దక్కే గౌరవాన్ని హర్షవర్ధన్ దక్కించుకోవడం చాలా సంతోషమని ఆయన సతీమణి డబుల్ ఒలింపియన్ సత్తిగీత సంతోషం వ్యక్తం చేశారు. హర్షవర్ధన్ స్వస్థలం గుంటూరు జిల్లానే. జాతీయ, అంతర్జాతీయ హాకీ పోటీలకు ఆయన అంపైర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో హాకీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.వెంకటేశ్వరరావుతోపాటు హాకీ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

యార్డులో 1,12,064 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,12,064 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,08,718 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 19,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,200 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 83,228 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్ట భద్రత

బాపట్లటౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 12 చెక్‌పోస్టులు చేసి పోలీస్ సిబ్బంది 24/7 విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.4,63,65,316 విలువ చేసే నగదు, గంజాయి, అక్రమ మద్యాన్ని సీజ్ చేశామన్నారు. అక్రమ మద్యం, నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు, బహుమతులను వివిధ రూపాలలో అక్రమ రవాణా చేసే అవకాశం ఉంటుంది కనుక ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

పార్థసారథి అలంకారంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు



మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామి వారు ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి పార్థసారథి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకోగా ఉత్సవాన్ని ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.



పట్టాభిపురంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన శ్రేణులతో మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే గిరిధర్



వైఎస్సార్ సీపీలో చేరిన మహిళలతో కలసి ఓ చిన్నారిని హత్తుకున్న మంత్రి విడదల రజిని

జగనన్నతోనే రాష్ట్రానికి మేలు

- పేదలంతా వైఎస్సార్ సీపీ వెంటే
- బీసీలు నమ్ముతుంది జగనన్నను మాత్రమే
- స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరికలు
- టీడీపీ కూటమిలో మిగిలేది పెత్తందారులు మాత్రమే
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



బీఎస్పీ నగర అధ్యక్షుడు రాంప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ ఏసురత్నం, డిప్యూటి మేయర్ బాలవజ్రబాబు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డితో మాత్రమే మన రాష్ట్రానికి పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డు పోస్టల్ కాలనీకి చెందిన 49వ డివిజన్ వాసులు వంద మందికిపైగా బీఎస్పీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. బీఎస్పీ నగర అధ్యక్షుడు చింతా రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నాయకులు పార్టీలో చేరారు. మంత్రి రజిని మాట్లాడుతూ చరిత్రలో నిలిచేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి సాధించారన్నారు. సచివాలయాల ఏర్పాటు ద్వారా ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు చేరాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతి ఇంటికి ప్రభుత్వ వైద్యుడు వచ్చి వైద్యం అందించే గొప్ప రోజులు జగనన్న పాలనలోనే వచ్చాయన్నారు. ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలతోపాటు, ప్రతి పేద వారి ఇంటికి ఈరోజు వలంటీర్లు వచ్చి స్వయంగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని, ఇదే నిజమైన సామాజిక సాధికారత అని వెల్లడించారు. అధికార పదవులు, నామినేటెడ్ పోస్టులు, ప్రభుత్వ పనులు చట్ట సభలు ఇలా అన్నింటిలోనూ జగనన్న సింహ భాగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందేలా చేశారన్నారు. అందుకే అన్ని పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసల ప్రవాహం కొనసాగుతోందని, మిగిలిన పార్టీలన్నీ ఖాళీ అవుతున్నాయన్నారు. టీడీపీ కూటమిలో మిగిలేది కేవలం పెత్తందారులేనని తేల్చి చెప్పారు.

గుంటూరు పశ్చిమలో వార్ వన్‌సైడ్

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని, వార్ వన్ సైడ్ అని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. ఏకంగా రూ.6 లక్షల కోట్ల లబ్ధిని డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా ప్రజలకు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. దేశ చరిత్రలో ప్రజలకు ఇంత మేలు చేకూర్చిన ఏకైక ముఖ్యమంత్రిగా సీఎం వై.ఎస్.జగన్ నిలుస్తారని తెలిపారు.

జగన్ అంటే జనం

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారని తెలిపారు. పెత్తందారులంతా ఏకమై సీఎం జగన్‌ను ఓడించాలని చూస్తున్నారని, వీరి ఆటలు ఇక సాగవని ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేందుకు ఎందాకైనా పనిచేసే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ అని కొనియాడారు. బహుజన మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు వర్ధన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ పాలనలో అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ పాలన ప్రతి ఒక్కరికి మేలు జరుగుతోందని, ఆయనతోనే పేదలకు మంచి జరుగుతోందని నమ్మి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మంత్రి రజిని గెలుపు కోసం పాటు పడతామన్నారు. పార్టీలో చేరిన వారిలో బీఎస్పీ నగర అధ్యక్షుడు రామ్‌ప్రసాద్, బహుజన మహా సేన నగర అధ్యక్షుడు వర్ధన్, పార్టీ నేతలు విజయ్‌కుమార్, శ్రీనివాస్, డాక్టర్ సి.ఎస్.రావు, తేజ, సాధిక్, జాన్సన్, మహేంద్ర, అరుణ, సాధిక్, స్వామి, శేఖర్, దినేష్, లెనిన్, అనిల్, ఫాతిమా, బ్యూలా, అనూషా, జాన్, రాజకుమారి, పూర్ణిమ, శివకుమార్, అనురాధ, దేవదాసు, పలు బహుజన, దళిత, ప్రజాసంఘాల నాయకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పార్టీల నుంచి చేరిక

పట్టాభిపురంలో డివిజన్ ఇన్‌చార్జి టి.ఎల్.వి.ఆంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి 200 మందికిపైగా కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి విడదల రజిని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళిగిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో జిలాని, బాలకృష్ణ, సుజాత, సత్యనారాయణ, కోటేశ్వరరావు, కడియం ఆంజనేయులు, సురేష్, స్వాములు, దానియేల్, వినయ్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మహానేతల విగ్రహాల ముసుగులు తొలగించండి


డొక్కా మాణిక్య వరప్రసాద్ వినతి



జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

గుంటూరు వెస్ట్: దేశానికి ఎనలేని సేవలు చేసిన మహనీయుల విగ్రహాలకు తాత్కాలికంగా ముసుగులు తొలగించాలని డొక్కా మాణిక్య వరప్రసాద్, దళిత సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డిని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో డొక్కా మాట్లాడుతూ ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రామ్, 11న మహాత్మా జ్యోతిబా పూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆ మహనీయులకు ఎన్నికల కోడ్ నేపథ్యంలో తొడిగిన ముసుగులను తాత్కాలికంగా తొలగించాలన్నారు. బడుగు బలహీనవర్గాలకు వారు చేసిన సేవలకు గానూ స్మరించుకోవడం కనీస ధర్మమని తెలిపారు. దళిత సంఘం నాయకులు అత్తోట జోసఫ్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పరంగి సత్య రాజు, రమావత్ బీకూ నాయక్, బత్తుల విల్సన్ పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 513.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,881, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 810.00 అడుగుల వద్ద ఉంది.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరువెస్ట్: విభిన్న ప్రతిభావంతులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అమలు చేస్తూ సిబ్బంది వారి ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఓటర్ల జాబితాలో పీడబ్ల్యూడీకి సంబంధించిన ఓటర్లను మార్క్ చేశామన్నారు. దీని ప్రకారం పోలింగ్ బూత్‌లలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ర్యాంప్ సౌకర్యం కల్పించామన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్ద కూడా ఓటు వేసే సౌలభ్యముందన్నారు. దీని కోసం బూత్ లెవెల్ అధికారులు పీడబ్ల్యూడీ ఓటర్లందరికీ 12డీ ఫామ్స్ అందిస్తారన్నారు. వీరు ఎన్నికల సంఘం సక్షమ్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, కమిటీ కన్వీనర్ హరిహరనాథ్, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వాటర్ బెల్స్

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో విద్యాశాఖ ముందు జాగ్రత్తలు
- విద్యార్థులు డీ-హైడ్రేషన్‌కు గురి కాకుండా ఏర్పాట్లు
- నేటి నుంచి అన్ని పాఠశాలల్లో అమలుకు ఆదేశాలు



నీరు తాగుతున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్ : పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు విద్యాశాఖ ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గతేడాదితో పోల్చితే ప్రస్తుతం రెండు, మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా, నిర్ణీత సమయానికి తాగునీటిని సేవించే విధంగా వాటర్ బెల్ అనే విధానాన్ని తీసుకువచ్చినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలల్లో బుధవారం నుంచి వాటర్ బెల్స్‌ను అమల్లోకి తేవాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. విద్యార్థులు నీటిని తాగేందుకు వీలుగా రోజులో మూడుసార్లు వాటర్ బెల మోగించాలన్నారు. ఉదయం 8.45 గంటలకు, 10.05 గంటలకు, తిరిగి 11.50 గంటలకు వాటర్ బెల్ మోగించి, విద్యార్థులందరు నీటిని తాగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తద్వారా విద్యార్థులు డీ-హైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండేందుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారని తెలిపారు.

13న యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు



విద్యాసదస్సు పోస్టర్లు విడుదల చేస్తున్న నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు తెలిపారు. 'ఆర్థిక, రాజకీయ కేంద్రీకరణల పర్యవసానాలు'' అనే అంశంపై వక్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో విద్యా సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా అన్ని జిల్లాల్లోనూ స్వర్ణోత్సవాలు జరుపుకోవాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని చెప్పారు. రాష్ట్ర సదస్సులో ప్రధాన వక్తలుగా ప్రముఖ ఎకనామిక్స్, స్వతంత్ర జర్నలిస్ట్ డి.పాపారావు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతారని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పాల్గొన్నారు.

కూటమి ప్రచారంలో జీఎంసీ ఉద్యోగి



టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థితో కలిసి ప్రచారంలో సోమి ఉదయ్‌కుమార్

నెహ్రూనగర్: ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకూడదని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ కొంత మంది వాటిని పట్టించుకోవడం లేదు. నగరపాలక సంస్థ మలేరియా విభాగంలో అవుట్ సోర్సింగ్(అప్కాస్) పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న సోమి ఉదయ్‌కుమార్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవితో కలిసి ప్రచారంలో పాల్గొనడంతోపాటు, జనసేన నాయకులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోకపోవడంతో తమను ఏం చేస్తారులే అనే చందాన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు.

అబద్ధపు హామీలు.. మోసపు మాటలు

- నారా లోకేష్ చంద్రబాబులకు వెన్నతో పెట్టిన విద్య
- ధ్వజమెత్తిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



మంగళగిరి: అబద్ధపు హామీలు..మోసపు మాటలు చెప్పి ప్రజలను మోసం చేయడంతో నారా లోకేష్, చంద్రబాబులకు మించిన నటులు లేరని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ధ్వజమెత్తారు. మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఐదేళ్లు అధికారంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మూడు శాఖల మంత్రిగా ఉన్న లోకేష్ అప్పుడు ఎందుకు మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మరలా తనను గెలిపిస్తే గచ్చిబౌలి చేస్తా సింగపూర్ చేస్తా ప్రజలు నమ్ముతారనుకోవడం వారి భ్రమ మాత్రమే అన్నారు. నా అల్లుడుని మించిన మహా నటుడు లేరని ఎన్టీఆరే స్వయంగా చెప్పారని లోకేష్ అంతకు మించి మహానటుడుగా మారి ప్రజలను వంచించేందుకు సిద్ధం అయ్యారని విమర్శించారు. నియోజకవర్గంలోని 23 వేల మందికి సీఆర్‌డీఏ పరిధిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలు ఇస్తే రాజధాని అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని కోర్టుకు వెళ్లి అడ్డుకున్నది లోకేష్, చంద్రబాబులు కాదా అని ప్రశ్నించారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్ల పట్టాలు ఇస్తామని మాయమాటలు చెబితే నమ్మేందుకు మంగళగిరి ప్రజలు అమాయకులు కాదని అన్నారు. దమ్ముంటే 2014 నుంచి 2019 వరకు ఐదేళ్లలో మీరు చేసిన ఒక్క అభివృద్ధి పని ప్రజలకు చూపించి ఓట్లు అడగండన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం చేసిన అభివృద్ధి పనులు రోడ్ల నిర్మాణాలు, చేనేత భవనం, మగ్గాల షెడ్లు, కమ్యూనిటీ హాల్స్, విద్యుత్ సబ్‌స్టేషన్‌లు అన్ని ప్రజలకు తెలుసునన్నారు. బీసీ మహిళ చేతిలో ఓడిపోతాననే భయంతో కోట్లు ఖర్చు చేసి గెలవాలనే లోకేష్‌కు మంగళగిరి ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. డబ్బు సంచులతో గెలవాలనుకుంటున్న నారా లోకేష్, అమెరికా నుంచి దిగుమతి చేస్తున్న గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసానిలకు గుణపాఠం తప్పదన్నారు. లోకేష్, పెమ్మసానిలు గెలిస్తే వారిని కలవడానికి ఎక్కడకి వెళ్లాలో తెలియదని ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉండే మన అమ్మాయి.. మన లావణ్యతోపాటు పార్లమెంట్ అభ్యర్థి కిలారు రోశయ్యలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వాణిజ్య దృష్టితో వ్యవసాయం చేయాలి

ఐసీఏఆర్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.సి.అగర్వాల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్.సి.అగర్వాల్

బాపట్ల: వాణిజ్య దృష్టితో వ్యవసాయం చేసేట్లుగా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్, వ్యవసాయ విద్య) డెప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.సి.అగర్వాల్ అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో జాతీయ స్థాయి శాస్త్ర సాంకేతిక సదస్సు మంగళవారం ప్రారంభించారు. అగర్వాల్ మాట్లాడుతూ భారతదేశంలో 80 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నట్లు చెప్పారు. మనం ఆహార భద్రత, పోషకాహారంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భవిష్యత్ వ్యవసాయం, వ్యవసాయ శాస్త్ర సాంకేతిక రంగాల ఆధారంగా నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణ దిశగా రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం అనే అంశంపై జరుగుతున్న ఈ సదస్సు చాలా ఘనమైనదని ఈ ఒకే ఒక్క అంశంపై అనేక సదస్సులు నిర్వహించవచ్చని అభిప్రాయపడ్డారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి వారి సంస్థాగత అభివృద్ధి పథకం ద్వారా దేశంలోని 76 వ్యవసాయ విశ్వవిద్యాలయాల నుంచి 2,900 మంది విద్యార్థులు, 1400 మంది అధ్యాపకులను ఎంపిక చేసి, వివిధ దేశాలలో నూతన వ్యవసాయ ఆవిష్కరణల సందర్శన, శిక్షణ నిమిత్తం పంపించడం జరిగిందని వివరించారు. దీనికోసం రూ.26 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. తద్వారా లభించిన ప్రగతిని ప్రపంచ బ్యాంకు అభినందించిందని తెలిపారు. కృషికోష్ వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన పరిశోధన పత్రాల ఆధారంగా నూతన ఆవిష్కరణలు రూపొందిస్తున్నామని తెలిపారు.

వాతావరణంపై ఆధారపడటం వలన సంక్షోభం

సదస్సుకు అధ్యక్షత వహించిన విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ వాతావరణంపై ఆధార పడటం వలన వ్యవసాయ రంగం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటుందని తెలిపారు. స్నాతకోత్తర వ్యవసాయ విద్యార్థులు తమ ఆవిష్కరణల ద్వారా రైతుల సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. కృత్రిమ మేధను రైతుల స్థాయికి చేర్చాలని, వ్యవసాయంలో విలువ ఆధారిత పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంలో జీవ సాంకేతిక పురోభివృద్ధి అనే అంశంపై కీలకోపన్యాసం చేసిన సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇనిస్టూట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషు మాధవ్ మాట్లాడారు. భారత దేశ ఆదాయంలో వ్యవసాయానిదే ప్రధాన పాత్ర అని, వ్యవసాయ ఉత్పత్తిలో 75 శాతానికి పైగా సన్నకారు రైతులు ద్వారా చేకూరుతుందని వివరించారు. విశ్వ విశ్వవిద్యాలయ పీజీ డీన్ డాక్టర్ ఏవీ రమణ మాట్లాడుతూ ఇటివంటి జాతీయ సదస్సులలో పాల్గొనడం వలన విద్యార్థులకు భావ వ్యక్తీకరణ నైపుణ్యం పెంపొందుతుందని, ఆత్మ విశ్వాసం, వ్యవసాయ పరిజ్ఞానం పెరుగుతాయన్నారు. గౌరవ అతిథి నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఆర్. గోపాల్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల దృష్ట్యా 2030 నాటికి ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడం పెద్ద సవాల్ అని హెచ్చరించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి జాతీయ సదస్సులు నిర్వహించే అతి కొద్ది వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒకటని, ఇప్పటి వరకు ఏడు సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ డి.సాయి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆగని తనిఖీల పరంపర

ఇప్పటి వరకు రూ.1,84,77,900 స్వాధీనం

గుంటూరు వెస్ట్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీ బృందాలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా తనిఖీలు కొనసాగించాయి. ప్రవర్తనా నియమావళిని ఉల్లఘించి తరలిస్తున్న వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో భాగంగా మంగళగిరి నియోజకవర్గ పరిధిలో 19.5 లీటర్ల మద్యం విలువ రూ.6200, తాడికొండ పరిధిలో రూ.1,24,350 నగదు, గుంటూరు పశ్చిమలో పార్టీ టవల్స్, 500 కరపత్రాలు విలువ రూ.1400, తూర్పులో రూ.10.80 లక్షలు నగదు సీజ్ చేశారని కలెక్టరేట్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటి వరకు జిల్లాలో స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం, వస్తువులు విలువ రూ.1,84,77,900 ఉందని పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడు కోవెలమూడి నానిపై కేసు

గుంటూరు ఈస్ట్: టీడీపీ నాయకుడు కోవెలమూడి నాని అనుమతులు లేకుండా పుట్టిన రోజు వేడుకలను నిర్వహించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల ఒకటో తేదీ రాత్రి కోవెలమూడి నాని తన జన్మదిన వేడుకలను అశోక్‌నగర్ మెయిన్ రోడ్డులో అనుమతులు లేకుండా జరిపారు. ర్యాలీ నిర్వహించి వాహన రాకపోకలకు అంతరాయం కలిగించారు. బాణసంచా కాల్చి హంగామా చేశారు. టీడీపీ అభ్యర్థుల ఫ్లెక్సీలను స్టేజీ వద్ద ఏర్పాటు చేశారు. దీనిపై ఎంసీసీ టీం ఇన్‌చార్జి ఝాన్సీ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలోనే సముచిత స్థానం

ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జెండా భుజాన పెట్టుకుని పాటు పడిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని ఐదో డివిజన్ కార్పొరేటర్ యాట్లరవి, లూకా ఆధ్వర్యంలో రామిరెడ్డితోట 6వలైనుకు చెందిన టీడీపీ, జనసేనకు సంబంధించి 28 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా కండువాలు కప్పి స్వాగతించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ పెద్ద పీట వేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధి, చూసి అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకి మొగ్గు చూపుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీలు ఎన్ని కూటములు పెట్టుకున్నా వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమన్నారు.


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

పార్టీలో చేరిన వారిలో డేవిడ్, సిద్దు, తులసి, నాగరాజు, ఏసుబాబుతోపాటు, వారి కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు చంద్రమోహన్, బసవయ్య, కొండలరావు, కోలా భవానీ, రేణుక, కిషోర్, రాంబాబు, గౌతమ్, సుధాకర్, మౌలాలి, విశాలాక్షి, లక్ష్మి,దుర్గ పాల్గొన్నారు.

డాక్టర్ వసంతరావుకు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విద్యా విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎం. వసంతరావుకు జాతీయ పురస్కారం వరించింది. అహ్మదాబాద్‌కు చెందిన గ్లోబల్ మేనేజ్ మెంట్ కౌన్సిల్ ఆదర్శ విద్యా సరస్వతి రాష్ట్రీయ పురస్కారం పేరుతో నేషనల్ ఎక్స్ లెన్స్ అవార్డు -2024 ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా వసంతరావును మంగళవారం యూనివర్సిటీలో ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ సత్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ.. వసంతరావు పరిశోధనలు యువతరం అధ్యాపకులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ప్రతి అధ్యాపకుడు బోధనా, పరిశోధన పట్ల ఆసక్తి చూపాలని సూచించారు. అవార్డు గ్రహీత డాక్టర్ వసంతరావు మాట్లాడుతూ బోధన, పరిశోధన రంగాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు సమర్పించినందుకు గ్లోబల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ తనకు ఈ అవార్డును ప్రదానం చేసిందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ప్రొఫెసర్ కె.మధుబాబు, దూరవిద్య కేంద్రం సంచాలకులు డాక్టర్ బి.నాగరాజు, నాక్ సంచాలకులు ప్రొఫెసర్ సంధ్య కోల్, విద్యా విభాగ సమన్వయకర్త డాక్టర్ పి. బ్రహ్మజీరావు, బీఈడీ కళాశాలల సమాఖ్య అధ్యక్షుడు గుండారెడ్డి, విశ్వవిద్యాలయ విద్యావిభాగ అధ్యాపకులు డాక్టర్ టి.సందీప్, డాక్టర్ రామిరెడ్డి, సిబ్బంది అనిత, వీరబాబు పాల్గొన్నారు.


డాక్టర్ వసంతరావును సన్మానిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, విశ్వవిద్యాలయాధికారులు

నాణ్యమైన తీర్పులకు కృషి చేయాలి

న్యాయవాదులకు జిల్లా న్యాయమూర్తి పార్థసారథి సూచన

నగరంపాలెం: న్యాయవాదులందరూ ఐక్యంగా ఉండి, నాణ్యమైన తీర్పులకు కృషి చేయాలని జిల్లా జడ్జి పార్థసారథి సూచించారు. ఇటీవల ఎన్నికైన గుంటూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమస్యలెదురైతే తన దృష్టికి తీసుకువస్తే, పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా బార్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి మాట్లాడుతూ నూతన కార్యవర్గం అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, నాలుగు, ఐదో అదనపు జిల్లా జడ్జిలు శరత్‌బాబు, నీలిమ, జూనియర్ సివిల్ జడ్జిలు, అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పాలూరి వెంకటరెడ్డి, చెరుకూరి సత్యనారాయణ, శాంతకుమార్, అసోసియేషన్ కార్యదర్శి అనురాధ, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, కోశాధికారి దేవదాస్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా జడ్జి పార్థసారథి, పక్కన కాసు వెంకటరెడ్డి, బ్రహ్మారెడ్డి

ప్రలోభాలకు లోనుకాకుండా ఓటేయండి

అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి

తాడేపల్లిరూరల్: ఓటు హక్కును వినియోగించుకునే వారు కుల, మత, రాజకీయ ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి సూచించారు. దుగ్గిరాల మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సిస్టమాటిక్ ఓటర్ల ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె విచ్చేశారు. 85 సంవత్సరాల వయసు పైబడిన వారు, దివ్యాంగులకు కల్పించిన హోం ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలన్నారు.ఓటు వేయడానికి వచ్చిన వారికి పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పిస్తామని, 18 సంవత్సరాలు నిండిన వారు ఎవరైనా తమ ఓటు నమోదు కానట్లయితే ఫాం-6ను ఆన్‌లైన్ లేదా బూత్ లెవల్ అధికారిని కలిసి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఓటర్లను ఉత్సాహపరుస్తూ ముగ్గుల పోటీలు, పాటల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ఓటర్ల చేత ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నైతిక ఓటింగ్ సందేశం బాగ్స్ (బూత్ లెవల్ అవేర్‌నెస్ గ్రూప్స్) ద్వారా ప్రతి ఇంటికీ చేరాలని తెలియజేశారు. దుగ్గిరాల మండలంలోని పోలింగ్ కేంద్రాలను రాజకుమారి పరిశీలించారు.


మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

ప్రతివర్గాన్ని అభివృద్ధి చేయగలిగిన నేత జగనన్న


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామి రెడ్డి, వేదికపై మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమా తదితరులు

- రాజ్యసభ సభ్యుడు, ప్రాంతీయ సమన్వయకర్త ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- కోవిడ్ సమయంలో వైద్యుల సేవలు వెలకట్టలేనివి: మంత్రి విడదల రజిని
- గుంటూరును విద్యా వైద్యానికి హబ్‌గా మారుస్తా : గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య
- వైద్యులు దేవుడితో సమానం : గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా
- జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధం కండి: గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా
- మేమంతా సిద్ధంలో.. వైఎస్సార్‌సీపీ వైద్యుల ఆత్మీయ సదస్సు

గుంటూరు రూరల్: రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని, అన్ని వర్గాలనూ అభివృద్ధి చేసి వారిని అగ్రగామిలో నిలిపే ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అభివర్ణించారు. మంగళవారం నగర శివారులోని ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీ కన్వెన్షన్‌లో మేమంతా సిద్ధం అంటూ వైఎస్సార్ సీపీ వైద్యుల ఆత్మీయ సదస్సు జరిగింది. మంత్రి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి విడదల రజిని, ఎమ్మెల్యేలు షేక్ మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరిఫాతిమా సదస్సులో పాల్గొన్నారు.

■ రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ.. తండ్రికి తగ్గ తనయుడిగా జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రానికి, ప్రజలకు చేసిన మేలు ఎనలేనిదన్నారు. కరోనా మహమ్మారి సమయంలో సైతం ముందు చూపుతో రాష్ట్రంలోని ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, వసతి, సంక్షేమ పథకాలను అందించిన ఏకైక నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కరోనా సమయంలో ఆంధ్ర రాష్ట్రమనే కుటుంబాన్ని జగనన్న ఓ తండ్రిలా కాపాడుకున్నారన్నారు.

■ గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వైద్యులు కోవిడ్ సమయంలో అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. వైద్యుల సమస్యలు, కష్టాలను తాను దగ్గరగా చూశానన్నారు. ఇతరుల ఆరోగ్యాన్ని కాపాడుతూ, వారి ఆరోగ్యం గురించి విస్మరించి సేవలు అందిస్తున్న వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి ఆరోగ్యశ్రీలో 3,750 ప్రొసీజర్లు, రూ. 4,100 కోట్లు ఏటా జగనన్న పేద ప్రజల కోసం ఖర్చు చేశారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, క్యాన్సర్ నివారణ కోసం 638 ప్రొసీజర్స్‌తో ప్రత్యేక ఆరోగ్యశ్రీ శాఖను ఏర్పాటు చేశారన్నారు.

■ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ విద్య, వైద్యరంగంలో గుంటూరును ప్రత్యేక హబ్‌గా తయారు చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. మరోమారు వై.ఎస్.జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు గుంటూరు పార్లమెంట్, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలతో పాటు జిల్లాలోని అన్ని స్థానాల్లో విజయ దుందుభి మోగించేలా వైద్యులు తమను ఆశీర్వదించాలని కోరారు.

■ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ తన కుమార్తె చిన్న వయసులో ప్రజా సేవకు సిద్ధమయిందన్నారు. ఆమెను ఆశీర్వదించాలని కోరారు.

■ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ చేసినదానికంటే మరో రెండు అడుగు ముందుకు వేస్తూ నాడు-నేడు ద్వారా వైద్యరంగంలో ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కుతోందన్నారు.

■ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ వైద్యులు దేవుడితో సమానమని, వైద్యుడంటే ప్రజలకు ఒక నమ్మకమని తెలిపారు. జగనన్న వైద్య రంగంలో ఆరోగ్యశ్రీ , 108,, 104, ఆరోగ్య సురక్ష వంటి పథకాలను ప్రవేశపెట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ తమను ఆశీర్వదించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయడంతోపాటు, మరో పది మందితో ఓటు వేయించి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేయాలని కోరారు.

కార్యక్రమంలో వైద్య విభాగం వైద్యులు డాక్టర్ టి.సి.రెడ్డి, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, డాక్టర్ వాసిరెడ్డి, డాక్టర్ వై.షేక్, డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అమర్‌నాథ్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ సుజాత, డాక్టర్ ఆనంద్, డాక్టర్ ముస్తఫా, డాక్టర్ జాన్‌పాల్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ మారుతి, డాక్టర్ అవినాష్, డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

బాబూ.. దళితులకు క్షమాపణ చెప్పు!

దళిత సంఘాల నాయకులు డిమాండ్

మంగళగిరి: 54 మంది దళిత పేద బడుగు బలహీనవర్గాలకు ఇళ్ల స్థలాలు దక్కకుండా కోర్టుకు వెళ్లి అడ్డుకున్న చంద్రబాబు ముందుగా దళిత జాతికి క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో దళిత సంఘాల నాయకులు మాట్లాడారు. ఎస్‌డీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు జనాభా దామాషా ప్రకారం దళితులకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బహుజన నాయకులతో కలిసి బహుజన రాజకీయ చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. బహుజన పరిరక్షణ సమితి నాయకుడు ఈపూరి ఆదామ్ మాట్లాడుతూ 54 వేల మందికి రాజధాని అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే రాజధానిలో దళిత పేద బడుగు బలహీనవర్గాలు ఉంటే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని కోర్టుకు వెళ్లి ఆపిన చంద్రబాబు వారిని ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెడితే కోర్టుకెళ్లి అడ్డుకున్నదెవరని నిలదీశారు. చంద్రబాబుకి టీడీపీకి దళిత బడుగు బలహీనవర్గాలను ఓట్లు అడిగే హక్కు ఎక్కడదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బొలిమేర శామ్యూల్ పాల్గొన్నారు.

ఏపీ నాయీ బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడిగా వెంకట్

నెహ్రూనగర్(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడిగా కందుకూరి వెంకట్ ఎన్నికయ్యారు. గుంటూరు బ్రాడీపేటలో జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. జేఏసీ ప్రధాన కార్యదర్శిగా మునగాటి రాజారావు, గౌరవ సలహాదారులుగా పి.వి.రమణయ్య, ఉడుముల్లాపురం సుబ్బారాయుడు, సభ్యులుగా భజంత్రీ రమేష్, వల్లూరు కోటేశ్వరరావు, ఆకునూరి సుబ్బారావు, నరవ పైడిరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో 13 లక్షలు పైగా ఉన్న నాయీ బ్రాహ్మణులను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని విమర్శించారు.


సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

మున్నంగిలో ఇసుక తవ్వకాలు నిలిపివేయండి

సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశం

మున్నంగి(కొల్లిపర): మున్నంగి కృష్ణానది వద్ద ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. మంగళవారం ఆయన మున్నింగిలోని నది తీరాన్ని డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దారు శ్రీనివాసులతో కలసి పరిశీలించి నాలుగు రోజుల క్రితం జరిగిన దాడులపై ఇరువర్గాలను పిలిపించి విచారించారు. ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని, లేని పక్షంలో ఇలాంటి గొడవలు ఎక్కువ జరిగే అవకాశాలున్నాయని ఇరువర్గాలు అధికారులకు స్పష్టం చేశాయి. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గొడవలు అయిన విధానం బట్టి రీచ్‌ని మళ్లీ ప్రారంభిస్తే గొడవలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎన్నికలు పూర్తయ్యే వరకు రీచ్‌లో ఎటువంటి తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ముగ్గురి అరెస్ట్

మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో కరకట్ట వద్ద ఇసుక రీచ్ సమీపంలో దాడి కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆర్ రవీంద్రరెడ్డి మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకా రం మున్నంగి ఇసుక రీచ్ లో ఇసుక తరలింపు విషయంలో అదే గ్రామానికి ఎస్సీ వర్గానికి చెందిన ఇరువర్గాలు శుక్రవారం సాయంత్రం పరస్పర దాడులు చేసుకున్నాయి. ఈ దాడుల్లో వేమూరి బాలరాజు, వేమూరి అశోక్, వేమూరి రాజేష్ లకు గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసి నిందితులైన వేమూరి మోషే, వేమూరి చింతయ్య, యలమాటి సంజయ్యలను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.


విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

తాడికొండ విద్యుత్ కేంద్రంలో లైన్ల మరమ్మతులు

- పాత వైర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు
- 30 వరకు విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం
- ఏపీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ పర్యవేక్షక ఇంజినీర్ శ్రీధర్

గుంటూరు ఈస్ట్: వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు 220 కేవీ తాడికొండ నుంచి 132 కేవీ, తాడేపల్లి ఉప కేంద్రానికి వచ్చే పవర్ లైన్‌కు పాత వైర్లు స్థానంలో కొత్త వైర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ పర్యవేక్షక ఇంజినీర్ శ్రీధర్ మంగళవారం తెలిపారు. ఈనెల 3 నుంచి 30వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లైన్ల మార్పిడి పనులు చేయడం జరుగుతోందన్నారు. దీనివల్ల విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా గుంటూరు 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. అయితే 33 కేవీ మంగళగిరి, నంబూరు, పెదకాకాని, మానస సరోవరం, ఆటోనగర్, పరిసర ప్రాంతాల్లో కొన్ని సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులూ.. తక్‌పట్టీ వెంట తీసుకెళ్లండి


- కమిషన్ వ్యాపారులే ఇస్తారు
- మిర్చి రైతులకు మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శ్రీనివాసరావు సూచన

కొరిటెపాడు (గుంటూరు): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి అమ్ముకుని నగదు రూపంలో తీసుకొని వెళ్లే రైతులు తప్పనిసరిగా సంబంధిత మిర్చి కమీషన్ వ్యాపారి వద్ద తక్‌పట్టి అడిగి తీసుకువెళ్లాలని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. గత వారం రోజులుగా రైతుల సొమ్మును అధికారులు స్వాధీనం చేసుకుంటున్నట్లు మార్కెట్ కమిటీ వారి దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల షెడ్యూలు వెలువడిన దృష్ట్యా నిబంధనలు అనుసరించి ఆధారం లేకుండా రూ.50 వేలు పైబడి నగదును తీసుకువెళ్లడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని వెల్లడించారు. రైతులు మార్కెట్ యార్డులో తమ ఎండు మిర్చిని అమ్ముకొని నగదు రూపంలో తీసుకొని వెళ్లే సమయంలో కమీషన్ వ్యాపారి నుంచి తప్పనిసరిగా తక్‌పట్టిని పొందిన తర్వాతనే నగదును తీసుకువెళ్లాలన్నారు. దీంతో సదరు నగదుకు ఆధారంగా తక్‌పట్టి ఉపయోగపడుతుందని తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బైక్‌పై ప్రయాణిస్తుండగా లారీ ఢీ

పెదకాకాని: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన నంబూరు ఐజేఎం సమీపంలో చోటు చేసుకుంది. యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామానికి చెందిన షేక్ మీరాబి (42) కుమార్తె అఖిలాబి గర్భిణి. అఖిలాభి మంగళవారం భర్తతో కలిసి వైద్య పరీక్షల నిమిత్తం చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి వచ్చింది. విషయం తెలిసిన మీరాబీ లింగారావుపాలెం నుంచి ఆసుపత్రికి చేరుకుంది. వైద్య పరీక్షల అనంతరం అల్లుడు, కుమార్తె సొంతూరికి వెళ్లిపోయారు. షేక్ మీరాబి స్వగ్రామానికి ఓ ద్విచక్ర వాహనంపై తిరుగు పయనమై వస్తుండగా నంబూరు సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఓ లారీ ఢీ కొంది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చుని ప్రయాణిస్తున్న మీరాబి అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. భర్త చిన శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.


మృతి చెందిన షేక్ మీరాబి

పాము కాటుతో బాలిక మృతి

పిట్టలవానిపాలెం: పాము కాటుతో బాలిక మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలం ఖాజీపాలెం శివారు ఎస్టీ కాలనీకి చెందిన మచ్చ మురళీ, కామేశ్వమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె దుర్గాభవాని(12) ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. దుర్గా భవాని మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలో టిఫిన్ చేయడానికి బీరువాలో డబ్బులు తీసుకునేందుకు బీరువాను తెరిచింది. బీరువా కింద నుంచి తెల్ల త్రాచు పాము దుర్గా భవానీని కాటు వేసింది. ఏదో పురుగు కుట్టింది అనుకుని ఎవరికీ ఈవిషయం చెప్పలేదు. ఉదయం 8 గంటల సమయంలో తల తిరుగుతుందని స్నేహితులతో చెప్పడంతో బాలికను తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లారు. కాలిపై ఉన్న గాట్లు చూసి పాము కరిచింది అని గ్రహించిన వారు పిట్టలవానిపాలెం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లా రు. అక్కడ నుంచి తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. మార్గ మధ్యంలోనే దుర్గాభవాని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.